19న చలో ఎంఈఓ

నవతెలంగాణ-నవీపేట్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ఈనెల 19న నిర్వహించే చలో ఎంఈఓ కార్యాలయ కార్యక్రమానికి మధ్యాహ్న భోజన కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజనం పథక కార్మిక యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించి విలేకరులతో మాట్లాడారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ మధ్యాహ్న భోజన కార్మికుల పాత బిల్లులు మంజూరు కాలేదని అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వెంటనే పెండింగ్లో ఉన్న పాత బిల్లులను మంజూరు చేసి ఎం డి ఎం కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొండా గంగాధర్, ఇబ్రహీం, హర్షద్ ,లక్ష్మి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

గురువారం 15 జూన్ 2023

సర్టిఫికేషన్ వెరిఫికేషన్ షురూ



అభ్యర్థుల సర్టిఫికేషన్‌లు పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు గాను క్వాలిఫై అయిన అభ్యర్థులు సర్టిఫికేషన్‌ల వెరిఫికేషన్ బుధవారం ప్రారంభించారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అదనపు డి.సి.పి (ఎ.ఆర్) గిరిరాజు ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుండి ప్రారంభిం చారు. 600 మంది అభ్యర్థులను పిలిచినట్టు తెలిపారు. అభ్యర్థుల సర్టిఫికేట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పరిపాలన అధికారి (ఏఓ) బి. శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంటులు శంకర్, మక్సూద్ హైమద్, గోవింద్ సిపిఓ కార్యాలయం సిబ్బంది, రిజర్వు విభాగం సిబ్బంది ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ శానిటేషన్‌లో ఇష్టారాజ్యం



- రెగ్యులర్ అధికారులను ఇతర ప్రాంతాలకు బదిలీ
- ఇతర విభాగాల నుంచి శానిటేషన్‌కు డిప్యూటేషన్
- డిప్లొమా లేకున్నా ఎస్ఐలుగా బాధ్యతలు
- ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి క్లస్టర్ శానిటేషన్ ఆఫీసర్లుగా నియామకం
- డిప్యూటేషన్లు రద్దు చేసిన పాత కమిషనర్ జితేష్ వి పాటిల్

నిజామాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాలు కాపాడాల్సిన మున్సిపల్ శానిటేషన్ విభాగం గందరగోళంగా తయారయ్యింది. రెగ్యులర్ అధికారులను బదిలీ చేసి... డిప్యూటేషన్ పేర ఇతర విభాగాల సిబ్బందిని ఈ విభాగానికి మళ్లించారు. డిప్యూటేషన్లను రద్దు చేస్తూ పాత కమిషనర్ ప్రస్తుత కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్ జారీ చేసిన ఆదేశాలను తుంగలో తొక్కారు. ఇక కనీస విద్యార్హతలు లేకున్నా జవాన్లను ఎస్ఐ(శానిటరి ఇన్‌స్పెక్టర్)లుగా నియమించడం చర్చనీయాంశమవుతోంది. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎస్ఐలుగా ఉంటే జవాబుదారితనం ఉండదని చెప్పి.. ఎస్ఐల కన్నా పైపోస్టుకు నియమించడం మున్సిపల్ అధికారులకే చెల్లింది. కీలకమైన ఈ శాఖలో మెడికల్ హెల్త్ ఆఫీసర్లతో పాటు కీలకమైన పోస్టులన్నింటిలోనూ ఇంఛార్జీలు ఉండటం గమనార్హం.

నవతెలంగాణ-
నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 60 డివిజన్లు ఉన్నాయి. ఈ డివిజన్లలో మురుగుకాలువలు, రోడ్లు శుభ్రం చేయడంతో పాటు నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్‌సెంటర్లు ఇతర వ్యాపార సముదాయాల్లో నిబంధనలను పాటింపచేయడంలో శానిటేషన్ విభాగం కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ప్రజారోగ్యం విషయంలో ముఖ్యపాత్ర పోషించాలి. కానీ ఈ విభాగంలో నెలకొన్న గందర గోళం, ఇష్టారాజ్యంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎంహెచ్ఓ అధికారిగా క్వాలిఫైడ్ డాక్టర్ విధుల్లో ఉండాలి. కానీ ప్రస్తుతం ఆ స్థానంలో డాక్టర్ కాకుండా ఇతరులు ఇంచార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ విభాగంలో మొత్తం ఐదురుగు రెగ్యులర్ అధికారులు విధుల్లో ఉండగా.. ముగ్గురిని ఇతర ప్రాంతాలకు బలవంతంగా బదిలీ చేశారు. పొమ్మనలేక పొగ బెట్టినట్టు.. ఆ అధికారులకు డివిజన్లు కేటాయించకుండా ఉద్దేశపూర్వకంగా నగరమంతా తిరిగేలా చేశారు. మూడు స్థానాలు ఖాళీ అయినట్టు బూచీ చూపి ఇతర విభాగాల నుంచి డిప్యూటేషన్‌పై ఇద్దరిని తీసుకొచ్చారు. అయితే ఈ డిప్యూటేషన్లను పాత కమిషనర్ జితేష్ వి పాటల్ రద్దు చేశారు. ఇతర విభాగాల నుంచి శానిటేషన్‌లోకి వచ్చిన సిబ్బంది తిరిగి ఆయా విభాగాల్లో విధుల్లో చేరాలని స్పష్టం చేశారు. కానీ ఆ ఆదేశాలు పాటించలేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సైతం అన్ని డిప్యూటేషన్ పోస్టులను రద్దు చేసినప్పటికీ.. నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మాత్రం ఇప్పటికీ డిప్యూటేషన్లలో కొనసాగుతున్నారు.

ఇష్టారీతిన ప్రమోషన్లు..

శానిటేషన్ విభాగంలో ఇటీవల ఇచ్చిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు(ఎస్ఐ) ప్రమోషన్లు చర్చనీయాంశమవుతున్నాయి. ఏడుగురు జవాన్లకు ఇటీవల ఎస్ఐలుగా ప్రమోషన్లు కల్పించారు. ఎస్ఐలుగా నియామించాలంటే ఏదైనా డిప్లొమా తప్పనిసరిగా చేయాలి. కానీ విద్యార్హతలను పట్టించుకోకుండా ప్రమోషన్లు కల్పించారు. అప్పటికే ఈ స్థానాల్లో డిప్లొమా చేసి నియామకం అయి కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పక్కనపెట్టారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జవాబుదారితనం ఉండదని, కాబట్టి రెగ్యులర్ సిబ్బందిని నియమించామని అధికారులు చెబుతున్నారు. కానీ జవాబుదారితనం ఉండబోదని చెప్పిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఎస్ఐల కంటే ఉన్నతమైన స్థానమైన క్లస్టర్ శానిటేషన్ ఆఫీసర్లు(సీఎస్ఓ)గా నియమించడం గమనార్హం. జవాన్ స్థానానికే సరిపోరని పక్కనపెట్టిన వారిని అంతకంటే ఎక్కువ పోస్టులో ఎలా నియమిస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇక ఎస్ఐలుగా నియమించిన జవాన్లకు సరైన విద్యార్హతలు లేకపోవడం వల్ల కనీసం నోటీసులు, రిపోర్టులు చేయడం సాధ్యపడటం లేదు.

ఉన్నత అధికారులకే తెలుసు : సాజిద్ అలీ, ఇంఛార్జి ఎంహెచ్ఓ

శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా జవాన్లకు ఇటీవల ప్రమోషన్లు కల్పించిన మాట వాస్తవమే. ఎస్ఐలుగా నియమించాలంటే డిప్లొమా చేయాలనే నిబంధన ఉంది. కానీ జవాన్లకు ఉన్న అనుభవం పరిగణలోకి తీసుకున్నాం. విద్యార్హతలు లేకున్నా ఎలా నియమించారనే విషయం ఉన్నత అధికారులకే తెలుసు. డిప్యూటేషన్లను రద్దు చేస్తూ పాత కమిషనర్ ఆదేశాలు ఇచ్చిన సమయంలో నేను నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో లేను. నేను సిద్ధిపేట నుంచి బదిలీపై వచ్చాను.

వైద్యరంగంలో పురోభివృద్ధి

- క్షేత్రస్థాయిలో ఆశా, అంగన్‌వాడీ, ఏఎన్‌ఎంలది క్రియాశీలక పాత్ర
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ వైద్యం : ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- ఘనంగా వైద్య ఆరోగ్య దినోత్సవం.. న్యూట్రీషన్ కిట్ పంపిణీ ప్రారంభం



కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ పంపిణీ ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది కృషితో రాష్ట్రంలో వైద్యరంగం పురోభివృద్ధి సాధిస్తోం దని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. కరోనా సంక్షోభ సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజలకు అందించిన సేవలు అమోఘమని ప్రశంసించారు. ప్రభుత్వం అమలు చేసే ఏ కార్యక్రమమైనా, ఏ సంక్షేమ పథకమైనా పూర్తిస్థాయిలో విజయవంతం అయ్యేందుకు ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. ఇదే స్ఫూర్తితో పని చేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నియోజకవర్గస్థాయిలో తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ ఏరియా ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్రావు, ఆర్మూర్ శాసనసభ్యులు ఆశన్న గారి జీవన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ వినీత పండిత్ తదితరులు పాల్గొన్నారు. స్వరాష్ట్ర సాధన అనంతరం వైద్య రంగంలో సాధించిన పురోగతి, చేపట్టిన విప్లవాత్మక మార్పులు, వివిధ వర్గాల ప్రజలకు అందిస్తున్న సేవల గురించి వక్తలు వివరించారు. గర్భిణీల్లో రక్త హీనతను నివారించేందుకు ప్రభుత్వం చేపట్టిన న్యూట్రీషన్ కిట్ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో ఇక్కడి నుండే లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా బాలింతలకు కేసీఆర్ కిట్లు అందించారు. ఉత్తమ సేవలందించిన వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు బహూకరించి సత్కరించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు గణనీయంగా మెరుగుపడిన విషయాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడంతో ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు.

ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య రంగం అధ్వాన్న స్థితిలో ఉండగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నేడు అత్యాధునిక హంగులతో పురోగమిస్తూ కార్పొరేట్ స్థాయిని మించిన వైద్యం ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. తెలంగాణలో వైద్య విప్లవానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కర్మ, కర్త, క్రియ అని కొనియాడారు. తొమ్మిదేళ్లలోనే వైద్య రంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా ఎదిగిందని జీవన్ రెడ్డి అన్నారు. తల్లీ పిల్లల సంరక్షణ కోసం 14 రకాల వస్తువులతో ఇస్తున్న కేసీఆర్ కిట్ ఎంతో సత్ఫలితాలు అందించిందని తెలిపారు. 2014లో 30శాతంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ప్రసవాలు, గత ఏప్రిల్ నాటికి 70శాతానికి చేరుకున్నాయన్నారు. బస్తీ దవాఖానల స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో మరింత మెరుగైన వైద్య సేవలను అందించాలన్న లక్ష్యంతో మూడు వేలకు పైగా పల్లె దవాఖానలను ఏర్పాటు చేస్తుండడం ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనమన్నారు. కిడ్నీ పేషంట్ల కోసం ఆర్మూర్‌లోనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశామని, ఆర్మూర్ నియోజకవర్గ వ్యాప్తంగా 26వేల మందికి పైగా అనారోగ్య బాధితులకు సీఎం ఆర్ ఎఫ్ ద్వారా ఆర్థిక చేయూతనందించామని వివరించారు. మరో 3 వేల మందికి ఎల్‌వోసీలు ఇప్పించి మెరుగైన వైద్య సాయమందించామని అన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ పండిత్ వినీతా పవన్, వైస్ చైర్మన్ మున్ను భాయ్, కౌన్సిలర్లు, ఎంపీపీలు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వేతనాల్లేవ్.. భోజనం బంద్

- టీయూలో రోజురోజుకూ గడ్డు పరిస్థితులు
- వీసీని ఘెరావ్ చేసిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు
- పవర్ లేని వీసీ రాజీనామా చేయాలని డిమాండ్



వీసీని ఘెరావ్ చేసి మాట్లాడుతున్న సిబ్బంది, విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఒకటో తేదీన వచ్చే వేతనాలు.. 14వ తేదీ దాటినా రాకపోవడంతో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మూడు రోజులుగా తమ విధులు బహిష్కరించారు. దీంతో మూడు రోజులుగా వంట చేయకపోవడంతో విద్యార్థులు పస్తులుంటున్నారు. టీయూలో రోజురోజుకూ గడ్డు పరిస్థితులు ఏర్పడుతున్నాయని, పంతాలకు పోయి యూనివర్సిటీకి మాయని మచ్చ తెస్తున్నారని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

బుధవారం ఈసీ పాలకమండలి సమావేశం ఉందని మంగళవారం రాత్రి తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పాలకమండలి సభ్యులకు సమాచారం అందజేశారు. ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ఉంటుందని తెలుసుకున్న అవుట్సోర్సింగ్ సిబ్బంది విద్యార్థులు వందల సంఖ్యలో పరిపాలన భవనం వద్దకు చేరుకున్నారు. అంతలోనే వైస్ ఛాన్సలర్ రావడంతో పరిపాలన భవనంలోకి వెళ్లకుండా అడ్డుకొని ఆయన ముందే బైటాయించి నినాదాలు చేశారు. వీసీకి హటావో యూనివర్సిటీ కో బచావో.. వైస్ ఛాన్సలర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని పవర్ లేని వీసీ ఎందుకని విద్యార్థులు ఔట్సోర్సింగ్ సిబ్బంది నినాదాలతో పరిపాలన భవనం మారు మోగింది. ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్‌ను పిలిపించి వేతనాల సంగతి తేల్చాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపటికి బ్యాంక్ మేనేజర్ వచ్చి మాట్లాడుతూ హైకోర్టులో కేసు ఉండటంతో చెక్కు క్లియరెన్స్ కావడం కష్టమన్నారు. టీయూకు ఇద్దరు రిజిస్ట్రార్‌లు ఉండటంతో డబ్బుల విషయంపై ఏమి చేయలేవని వైస్ ఛాన్సలర్ నియమించిన రిజిస్టర్ కనకయ్య ఉంటే ఈసీ సభ్యుల అనుమతి తప్పనిసరిగా కావాలని లేక ఇంతకుముందు ఉన్న రిజిస్టర్ యాదగిరి ఉంటే వైస్ ఛాన్సలర్ సంతకం పెట్టిన చెక్కు క్లియరెన్స్ అయి వేతనాలు వస్తాయని బ్యాంకు మేనేజర్ తేల్చి చెప్పారు. నాలుగైదు గంటల పాటు వైస్ ఛాన్సలర్‌ను అడ్డుకున్నారు. వీసీకు పవర్ ఉంటే యూనివర్సిటీలో పనిచేసే అధికారులను బయటికి రప్పించి అందరి సమక్షంలోనే సంతకం చేసి సమస్యను తీర్చిన తర్వాతనే లోనికి వెళ్లాలని స్పష్టమైన హామీ ఇవ్వనిదే వదిలిపెట్టబోమని తేల్చి చెప్పారు.

మూడు రోజులుగా పస్తులు

గత మూడు రోజులుగా వసతి గృహాల్లో వంటలు చేయక పస్తులు ఉంటున్నామని తాగడానికి నీళ్లు సైతం దొరకని పరిస్థితి దాపురించిందని ముందుగా వీర సమస్యలు పరిష్కారమైతేనే వారు భోజనాలు తయారు చేస్తారని, యూనివర్సిటీలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఔట్సోర్సింగ్ సిబ్బంది ఆందోళన చేపట్టడంతో తాగునీటికి సైతం కొరత ఏర్పడిందని విద్యార్థులు వీసీ పై కోపోద్రిక్తు లైయ్యారు.

ఈసీ సమావేశం హుష్

పాలకమండలి సమావేశంలో టీయూలో బుధవారం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఈ సమావేశానికి పాలకమండలి సభ్యులు హాజరుకావాలని మంగళవారం రాత్రి 7 గంటలకు వాట్సాప్ ద్వారా సమాచారం అందజేశారు. అసలు పాలకమండలి సమావేశం ఏర్పాటు చేయాలన్న ఏడ్రోజుల ముందుగా పాలకమండలి సభ్యులు సమాచారం ఇవ్వవలసి ఉంటుందని అలా కాకుండా హడావిడిగా రాత్రి సమయంలో వాట్సాప్ ద్వారా సందేశాన్ని పంపడంతో జరగవలసి ఉన్న పాలకమండలి సమావేశం ఒక్క పాలక మండలి సభ్యుడు రాకపోతే సమావేశం జరగలేదు.

ఇండ్లు, ఇంటి స్థలాల సాధనకు బస్సుయాత్ర



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

- జూన్ 24న జిల్లాలో ప్రవేశం.. జయప్రదం చేయండి
- ప్రజాసంఘాల ఐక్య పోరాట వేదిక పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధన కోసం ప్రజాసంఘాల ఐక్య పోరాట వేదిక ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేపట్టనున్నట్టు ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. ఈ నెల 24వ తేదీనా జిల్లాకు ప్రవేశించనున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రజా సంఘాల ఐక్య పోరాట వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి నుర్జహాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూరి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడారు. రాష్ట్రంలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించి, ఇండ్ల నిర్మాణం పూర్తి అయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలందరికీ తక్షణమే కేటాయించాలని తెలంగాణ ప్రజా సంఘాలు పోరాట వేదిక ఆధ్వర్యంలో 18నుండి 27 వరకు రాష్ట్రవ్యాప్త బస్సుయాత్ర జరగనున్నట్టు తెలిపారు. ఈ యాత్ర నిజామాబాద్ జిల్లాకు 24న చేరుకోనున్నట్టు తెలిపారు.

దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు అవుతున్న పేదవాడికి సొంత ఇల్లు లేకపోవడం పేద ప్రజల పట్ల పాలకుల చిత్తశుద్ధి ఏమిటో స్పష్టమవు తుందని అన్నారు. ఉండడానికి ఇల్లు లేక, చేసుకోవడానికి చేతినిండా పనులు దొరక్క అద్దె ఇళ్లలో ఉంటూ అనేక అవమానాలు భరిస్తున్నారని అన్నారు. ప్రతి పౌరుడికి తినడానికి తిండి కట్టుకోవడానికి బట్ట ఉండడానికి ఇల్లు కల్పించాలనే భారత రాజ్యాంగ స్ఫూర్తిని పాలక ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయాలేదని అన్నారు. ఇల్లు లేని పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అర్హులైన పేద ప్రజలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. జీవో నెంబర్ 58 ప్రకారం ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు క్రమబద్ధీకరణ చేసి వెంటనే అమలు చేయాలని కోరారు. 2020 కంటే ముందే ఇల్లు కట్టుకొని ఉండాలనే నిబంధనలతో పాటు లబ్ధిదారుల పేరు మీద ఏదైనా ఒక ఆధారం ఉండాలనే తిరకాసు పెట్టిందని అన్నారు. ఫలితంగా ప్రస్తుతం ఇండ్లు నిర్మించుకున్న పేదలకు ఈ జీవో ప్రకారం పట్టాలు పొందే అవకాశం లేకుండా పోతుందని అన్నారు. రాజకీయ పలుకుబడి కలిగిన పెద్దలు, ఇతర కార్పొరేటు, రియల్ ఎస్టేట్ సంస్థలు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం పూనుకుంటున్నదని అన్నారు. ప్రభుత్వ జీవోల్లో ఉన్న అస్పష్ట నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేశారు.

గుడెసెలు వేసుకున్న పేదలను తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి, అక్రమ కేసులు పెట్టి హింసిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ భూముల్లో పక్కా ఇండ్లు నిర్మాణం చేసుకున్న వారందరికీ ఇంటి పట్టాతోపాటు ఇంటి నెంబరు, కరెంటు మీటరు, వాటర్ కనెక్షన్లు, నిర్మాణంతో పాటు, గృహ లక్ష్మీ పథకం కింద ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. ఇండ్లు, ఇళ్ల స్థలాలు, డబల్ బెడ్రూం సాధనకై 24న జరిగే బస్సు యాత్రను నిజమాబాద్ ప్రజలందరు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధర్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అనిత, సీఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర్, వ్యవసాయ కార్మిక సంఘం పుష్పలింగం, శంకర్ పాల్గొన్నారు.

వడ్ల పైసల్ ఫ్రీజ్



మేనేజర్‌తో రైతుల వాగ్వాదం

- రుణాల కింద జమచేసుకుంటామని వేధింపులు
- మేనేజర్‌ను నిలదీసిన రైతులు

నవతెలంగాణ-లింగంపేట్

వడ్లు విక్రయించిన డబ్బులను బ్యాంక్ అధికారులు ఫ్రీజ్ చేస్తున్నారు. డబ్బులను తీసుకోడానికి వీలు లేకుండా అకౌంట్ హోల్డ్‌లో పెట్టారు. అడిగితే పంట రుణం ఉందని, ఇతరాత్ర కారణాలు చూపుతూ డబ్బులు ఇవ్వకుండా బ్యాంక్ మేనేజర్‌లు వేధింపులకు గురి చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. తాజాగా లింగంపేట్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ ఆర్య రాజన్‌ను రైతులు బ్యాంకులో నిలదీశారు.

లింగంపేట్ మండలంలోని లింగంపల్లి పరమల్ల బోనాల్ రాంపల్లి సురాయిపల్లి మోతేతో పాటు ఆయా గ్రామాలకు చెందిన రైతులు, లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, లింగంపల్లి పెద్ద రైతు గొల్ల కాశిరంతో పాటు రైతులు కలిసి బ్యాంకు మేనేజర్ దగ్గరికి వెళ్లారు. వడ్ల పైసలు ఎందుకు ఇవ్వడంలేదని మేనేజర్‌ను రైతులు అడగగా ఆయన రైతుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో ఏం చేస్తారో చేసుకోండి అండమాన్ నికోబార్‌కు బదిలీ చేస్తారా అని వెటకారంగా మాట్లాడటంతో రైతులు ఆగ్రహించారు. అప్పులు చేసి పంటలు సాగు చేస్తే వడ్ల పైసలు మా పైసలు మాకు ఇవ్వమంటే రైతులను ఎందుకు ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా ఖాతాలను ఫ్రిడ్జ్ చేస్తావని మేనేజర్ తీరుపై రైతుల మండిపడ్డారు. వడ్ల పైసలు మేనేజర్ ఇవ్వడం లేదని రైతులు లింగంపేట సింగిల్ విండు చైర్మన్ దేవేందర్ రెడ్డి కి లింగంపల్లి రైతు కాశిరాంకు చెప్పడంతో వారు రైతుల పైసలు బకాయి కింద పట్టుకోవద్దని మేనేజర్ కు సూచించిన మేనేజర్ వారి మాట వినిపించుకోలేదు.

మండలంలోని ఆయా గ్రామానికి చెందిన 150 మంది రైతుల వడ్ల డబ్బులు ఖాతాలో జమై 20 రోజులు గడుస్తున్న బ్యాంకు మేనేజర్ ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నాడని మేనేజర్ తీరుపై ఎల్లారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్ నాయక్ ఫోన్లో సమాచారం అందించారు. మేనేజర్ పై చర్య తీసుకోవాలని ఆర్డీవో కు ఫిర్యాదు చేశారు. అసైన్మెంట్ భూములకు లోన్ ఎలా మంజూరు చేశారని సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి మేనేజర్ నిలదీయగా నేను లోను మంజూరు చేయలేదని చేతులెత్తేశారు. ఆడపిల్లల పెళ్లి ఉన్నాయి. ఆస్పత్రికి వెళ్లాలి. పిల్లలకు చదువు ఫీజు కట్టాలని మేనేజర్ ను వడ్ల పైసలు ఇయ్యాలని బతిమిలాడిన ఇవ్వకుండా రైతులను 20 రోజులుగా బ్యాంకు చుట్టూ తిప్పుకుంటు న్నారని రైతులు మండిపడ్డారు. లంచం ఇచ్చిన వారికి కొత్తగా లోను మంజూరు ఇస్తూ పర్సెంటేజీ రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. కాగా ఈవిషయమై సదరు బ్యాంక్ రీజినల్ మేనేజర్‌కు రైతులు ఫిర్యాదు చేశారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

- రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి చెందడంతో తీవ్ర మనస్తాపం

నవతెలంగాణ-లింగంపేట్



రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి చెందడంతో తీవ్ర మనస్తాపానికి గురైన తండ్రి.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన లింగంపేట్ మండలంలోని ఐలాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ శంకర్ వివరాల ప్రకారం.. ఐలాపూర్ గ్రామానికి చెందిన సూర్ణ పెద్ద సాయిలు (60)కు ఇద్దరు బిడ్డలు, ఒక కొడుకు. తన పిల్లల అందరి పెళ్లిళ్లు అయ్యాయి. తన కొడుకు సుర్ణ సంజీవ్ (26) ఇందల్‌వాయి వద్ద 20 రోజుల క్రితం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అప్పటి నుంచి సాయిలు మానసికంగా కృంగిపోయాడు. దీంతో మంగళవారం రాత్రి పది గంటల సమయంలో ఇంట్లో రేకుల షెడ్డు వద్ద ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య



పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-మోపాల్

కామారెడ్డి జిల్లా భిక్కనూర్ గ్రామానికి చెందిన కొజ్జాపురం శ్రీధర్(26) గత సంవత్సరం అత్తగారి గ్రామమైన మంచిప్ప గ్రామానికి బతుకుతెరువుకు వచ్చి కూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరచుగా ఆస్తి విషయంలో అప్పుడప్పుడు చిన్న చిన్న గొడవలు జరిగేవి. మంగళవారం నాడు తన స్నేహితుడి తల్లి అంత్యక్రియలకు వెళ్లి వచ్చిన తర్వాత సాయంత్రం దాదాపు 7 గంటల సమయంలో కిరాయి ఉంటున్న ఇంటి నందు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని. అతని తండ్రి భూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు మోపాల్ ఎస్సై జి మహేష్ తెలియజేశారు.

ఖానాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఖానాపూర్ గ్రామంలో ఎన్ ఆర్ జి ఎస్ ద్వారా 10 లక్షల నిధులతో సిసి రోడ్డు పనులు ప్రారంభించినట్టు సర్పంచ్ సింగిరెడ్డి మోహన్ బుధవారం తెలిపారు గ్రామ అభివృద్ధికి, గ్రామంలో నెలకొన్న సమస్యలపై త్వరితగతిన స్పందిస్తున్న ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



చిన్నసాయన్నకు నివాళ్లు అర్పించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

విశ్వ ఆగ్రోటెక్ డైరెక్టర్ భైర సుభాష్ తండ్రి భైర చిన్న సాయన్న పెద్దకర్మను నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం గ్రామంలో బుధవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొని చిన్నసాయన్న చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనూష ప్రేమ నాయక్, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, మండల అధ్యక్షులు మీసాల మధుకర్ రావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు గోపాల్ నాయక్, సర్పంచ్ చింతకింది నాగేష్ ఉన్నారు.



వైద్యారోగ్య రంగంలో సరికొత్త అధ్యాయం

- నేను వస్త బిడ్డో సర్కారు దవాఖానాకు అనేలా మారింది
- బస్తీ దవాఖానలు, పల్లె దవాఖానాలు ఏర్పాటు
- ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వైద్యారోగ్య రంగంలో తెలంగాణ ప్రస్థానం ఒక దేశంలోనే సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిందని, గతంలో నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అనే వారని దానిపై పాట కూడా ఉందని, కేసీఆర్ సీఎం అయిన తర్వాత నేను వస్త బిడ్డ సర్కారు దవాఖానకు అనే నినాదం ప్రతి ఒక్కరి నోటి నుండి వస్తుందని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం బుధవారం డిచ్ పల్లి మండల కేంద్రంలోని ఎస్ఎల్‌జీ గార్డెన్ లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాజిరెడ్డి గోవర్ధన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండడానికి బస్తీ దవాఖానలు, పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, కెసిఆర్ కిట్, ప్రతిభ కనబరిచిన పలువురికి ప్రశంస పత్రాలు, పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఇప్పటివరకు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం లో 22 కోట్ల రూపాయల విలువగల చెక్కులను పంపిణీ చేశామని పేర్కొన్నారు. కరోనా కాలంలో ప్రాణాలు పణంగా పెట్టి ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎం లు, వైద్య సిబ్బంది అందించారని, వారి సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డిసిఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, నిజామాబాద్ ఆర్డీవో రవి, డిప్యూటీ డిఎంహెచ్ఓ తుకరం రాథోడ్, డాక్టర్ సంతోష్ కుమార్, సైయ్యద్ నజిరోద్దిన్, శంకర్, నియోజకవర్గ వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్లు, వివిధ మండలాలకు చెందిన జడ్పిటిసిలు ఎంపీపీలు, వైస్ ఎంపీపీ లు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, మహిళలు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

బాల్యవివాహాన్ని అడ్డుకున్న సిడిపిఓ



కౌన్సెలింగ్ ఇస్తున్న సీడీపీవో

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని ముదక్‌పల్లి గ్రామంలో ఓబాలికకు వివాహం చేస్తుండగా సీడీపీవో అడ్డుకున్నారు. నవీపేట్‌కు చెందిన 16 ఏండ్ల అమ్మాయిని ముదక్ పల్లి గ్రామానికి చెందిన అబ్బాయితో పెళ్లి జరుగుతుందని తెలిసింది. వెంటనే సిడిపిఓ సౌందర్య అక్కడికి చేరుకుని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వెంటనే అమ్మాయిని సఖి కేంద్రానికి తరలించారు. ఈసందర్భంగా సిడిపిఓ సౌందర్య మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అమ్మాయికి 18 సంవత్సరాలు వయసు వచ్చేవరకు పెళ్లి చేయవద్దని తల్లిదండ్రులకు, అబ్బాయి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మోపాల్ మండల్ సూపర్వైజర్ జాకీరా బేగం మరియు హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది విజయలక్ష్మి రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వార్ వన్ సైడే

- ఎమ్మెల్యే జీవన్ రెడ్డి
- గొట్టుముక్కలలో నమస్తే నవనాథపురం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

ఆర్మూర్ నియోజకవర్గంలో కారు జోరు స్పీడ్ ను ఎవ్వరు అప్పలేరని, వచ్చే ఎన్నికల్లోనూ వార్ వన్ సైడే ఉంటుందని ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్ రెడ్డి దిమా వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో నమస్తే నవానాపురం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందాయని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నల్ల తిపితే మంచి నీరు అందించామన్నారు. మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమమలో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, ఎంపీపీ మాస్త ప్రభాకర్, గ్రామ సర్పంచు ప్రవీణ్, ఎంపిటిసి, పలువురు బీఆర్ఎస్ నాయకులు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జేసిఐ ఇందూర్ ఆధ్వర్యంలో బుధవారం నిజామాబాద్ నగరంలోని రెడ్ క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సంద ర్భంగా జేసిఐ పూర్వా ధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, జోన్ ట్రైనర్ బంగారి విమల్ రాజ్, జెసిఐ సభ్యులు ఉత్తేజ్ తదితరులు రక్తదానం చేశారు. జేసిఐ ఇందూర్ అధ్యక్షులు జిల్కర్ నయన్, పూర్వాధ్యక్షులు జిల్కర్ విజయానంద్, బంగారి వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. రక్తదానానికి ముందుకు వచ్చిన జేసిఐ ఇందూర్ ప్రతినిధులను జేసిఐ జోన్ డైరెక్టర్ జయంత్ శెట్టి అభినందించారు.



రక్తదానం చేస్తున్న సభ్యులు

విద్యార్థి కుటుంబానికి భూపతిరెడ్డి పరామర్శ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని దేవానగర్ క్యాంపు గ్రామానికి చెందిన ఒక యువకుడు మంగళవారం మండల కేంద్రంలోని నగ్ పుర్ గేట్ బ్రిడ్జి వద్ద కంటైనర్ ఢీకొని బిటెక్ విద్యార్థి అభిషేక్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకొని బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ రూరల్ ఇంచార్జీ డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అమృతపూర్ గంగాధర్, పిసిసి డెలిగేట్ శ్యాంసన్, డిసిసి డెలిగేట్ వాసు, డిసిసి డెలిగేట్ ధర్మ గౌడ్ , సాయిరెడ్డి, రాజన్న, ఇబ్రహీం, లింగం, వినోద్, సురేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కుటుంబాన్ని పరామర్శించారు.

బస్తీ దవాఖానాను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంటేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల 34వ డివిజన్ మిర్చి కంపౌండ్ లో బస్తీ దవాఖానను బుధవారం ప్రారంభించారు. బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయడం సీఎం కేసీఆర్‌కే సాధ్యమైందని, ఇలాంటి బస్తి దవాఖానాల వల్ల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ బురుగుపల్లి కల్పన, నుడ డైరెక్టర్ మల్లేష్ గుప్తా, నాయకులు జుగల్ కిషోర్ పాండే, దండు శేఖర్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శంగా తెలంగాణ వైద్య రంగం

- ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్యం
- కోవిడ్‌లో సేవలు అందించిన వైద్య సిబ్బందికి సెల్యూట్
- వైద్య ఆరోగ్య దినోత్సవంలో ఎమ్మెల్యే గణేష్ బిగాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో వైద్య రంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల తెలంగాణ వైద్య రంగం దేశంలో మొదటి స్థానంలో ఉందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త అన్నారు. నిజామాబాద్‌నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య దినోత్స వంలో బుధవారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ.. కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస విస్తే 12వేలు, ఆరోగ్య లక్ష్మీ పథకాలు, వైద్య సిబ్బంది కృషితో ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలలో నమ్మకం పెరిగింద న్నారు. ప్రభుత్వ ఆసు పత్రి లలో వైద్య సదుపా యాలు మెరుగు పరచటంతో ప్రయివేటు ఆస్పత్రు లకు ధీటుగా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ ద్వారా సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా సాధారణ ఆసుపత్రిలలో 60 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. ప్రభుత్వం. మహిళల ఆరోగ్య పరిరక్షణ కొరకు ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మహిళ కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మీ ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకురాలు డా. ప్రతిమ రాజ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. ఇందిరా, డిఎంహెచ్ఓ డాక్టర్ సుదర్శనం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల

అంతర్జాతీయ అవార్డు దక్కించుకున్న 'మట్టికథ' హీరో

- ఆర్మూర్ వాసి కావడంతో పలువురి హర్షం

నవతెలంగాణ-ఆర్మూర్

మట్టి కథ హీరో అజయ్ వేద్ అంతర్జాతీయ అవార్డు దక్కించుకున్నారు. అజయ్‌వేద్ ఆర్మూర్ పట్టణానికి చెందిన వాడు కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మనుషులకు మట్టితో ఉన్న అనుబంధాన్ని మట్టి విలువను కథాంశంగా తీసిన మట్టి కథ సినిమా హీరో అజయ్ వేద్‌కు ఇండో ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో బెస్ట్ యాక్టర్ ఫీచర్ ఫిల్మ్ అవార్డు రావడం విశేషం. గతంలో ఇదే అవార్డు తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి, బలగం హీరో ప్రియదర్శిలకు కూడా వచ్చింది. ఇప్పుడు వీరిద్దరి సరసన బెస్ట్ యాక్టర్ అవార్డుతో మట్టి కథ హీరో అజయ్ వేద్ చేరారు. మొదటి సినిమాలోనే ఉత్తమ నటన ప్రదర్శించి అవార్డు కైవసం చేసుకొని తెలుగు ఫిలిం ఇండస్ట్రీ అభినందనలు పొందుతున్నాడు. తెలంగాణ పల్లెలోని యువకుడి కథను పల్లె వాతావరణంలో తెరకెక్కించిన సినిమా మట్టి కథ. ఇండో ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మూడు అవార్డులు దక్కించుకుంది. బెస్ట్ ఇండియన్ ఫీచర్ ఫిల్మ్ బెస్ట్ యాక్టర్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో విజేతగా నిలిచింది. డెబ్యూట్ ఫిల్మ్ మేకర్ ఆఫ్ ఫీచర్ ఫిల్మ్ కింద ఎంపిక అయింది మట్టి కథ .ఇండో ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ అవార్డుల రాకతో మట్టికథ సినిమాపై అటెన్షన్ బజ్ క్రియేట్ అయింది. ఇదే ఇండో ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఇటీవల బలగం సినిమాకు అవార్డులు వచ్చాయి. బెస్ట్ యాక్టర్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరిలో నటుడు ప్రియదర్శి ఎంపికయ్యాడు ఇప్పుడు అదే కేటగిరీలో మట్టి కథ సినిమా హీరో అజయ్‌వేద్ ఉత్తమ నటుడిగా ఎంపిక కావడం మూవీపై అంచనాలను పెంచేసింది. ఇండో ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌లో మమ్మనీతం అనే తమిళ సినిమా హీరో విజయ్ సేతుపతి ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. కాగా నటుడు పట్టణంలోని మానస పాఠశాల యజమాని మానస గణేష్, పద్మ కొడుకు కావడం విశేషం.



మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు పెంచాలి

- ఎస్ఈ కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు పెంచాలని ఎస్ఈ కార్యాలయం ముందు జేఏసీ నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. మిషన్ భగీరథ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని, కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని, అధికారుల వేధింపులు ఆపివేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా ఐఎఫ్టియు, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ వద్ద గల మిషన్ భగీరథ ఎస్ఈ. కార్యాలయం లో ముందు ధర్నా నిర్వహించి ఎస్ఈ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు తాగునీరు అందించే అద్భుత పథకంగా ప్రభుత్వం చెప్పుకుంటున్న మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, కాంటాక్ట్ కంపెనీల పైస్థాయి సిబ్బంది సైతం కార్మికులను వేధింపులు గురిచేస్తున్నారని ఆరోపించారు. మిషన్ భగీరథ కార్మికులకు జీవో నెం.60 ప్రకారం నెలకు స్కిల్ లేబరుకు రూ. 22500, సెమీ స్కిల్ లేబరుకు రూ.19500, అన్ స్కిల్డ్ లేబరుకు రూ.15600 వేతనం ఇవ్వాలని అన్నారు. ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ, బోనస్ 8.33 శాతం అమలు చేయాలన్నారు. వారంతర సెలవు, జాతీయ, పండగల సెలవులు అమలు చేయాలని కోరారు. వాల్వ్ ఆపరేటర్లకు టి.ఎ. ఇవ్వాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని అన్నారు. 2021లో పెండింగులో ఉన్న రెండు నెలల వేతనం తక్షణమే విడుదల చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రగతిశీల మిషన్ భగీరథ వర్కర్స్ యూనియన్ నాయకులు బాలరాజు, పోశెట్టి, తారాచంద్, మహిపాల్, అరుణ్, లింగం, రవి ఏఐటీయూసీ నాయకులు నర్సింగరావు, చక్రపాణి, హనుమన్లు, అనిల్, దేవేందర్, రమేష్, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి గణేష్, నగర అధ్యక్షులు అషర్ యూనియన్ నాయకులు సందీప్, చంద్రకాంత్, గంగారం, ప్రశాంత్, ప్రవీణ్, సాయిలు, లింగం, సంతోష్, నరేష్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కేంద్రం తీరు.. ఇత్తు వేసి పొత్తు కూడినట్టు

- పాల్ద గ్రామసభలో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ఇత్తు వేసి పొత్తు కూడినట్టు కేంద్ర ప్రభుత్వం తీరు ఉందని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. రూరల్ మండలం పాల్దా గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీగా పాల్దగ్రామం అవార్డు పొందడం ఎంతో గర్వకారణమని అన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు పంపిస్తుందని బిజెపి నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే తెలంగాణలో అమలవుతున్న పథకాలు ఇతర రాష్ట్రాల్లో ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించాలని ప్రజలకు సూచించారు. మాధవ నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి కోసం రాష్ట్ర ప్రభుత్వం 60 కోట్లు నిధులు కేటాయిస్తే కేంద్ర ప్రభుత్వం కేవలం 30 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. ఎంపీ అరవింద్ రైల్వే బ్రిడ్జిలు తానే తెప్పించానని గొప్పలు చెప్పుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. నాలుగు కోట్ల 25 లక్షల రూపాయలతో చెక్ డ్యామ్ నిర్మించామని నిజాంసాగర్ కెనాల్ నీళ్ళు పాల్ద కు రావడం ఇది గొప్ప వరమని, పాల్ద గ్రామానికి 10 కోట్ల నిధులు మంజూరుచ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అనూష, జడ్పిటిసి సుమలత, సర్పంచ్ సుప్రియ, ఎంపీటీసీ సభ్యురాలు మమత, నుడ డైరెక్టర్ సంతోష్, పార్టీ మండల అధ్యక్షుడు మధుకర్ రావ్, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, ఎస్టి సెల్ మండల అధ్యక్షుడు గోపాల్ నాయక్, తహసీల్దార్ అనిల్, ఎంపీడిఓ మల్లేశం, గుండారం ఎంపీటీసీ గంగాధర, సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపిటిసిలు, సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు పార్టీ నుబంధ సంఘాల నాయకులు, పాల్గొన్నారు.



పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

10 లక్షల ఎస్‌డీఎఫ్ అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి సంబంధించిన కుర్మ సంఘం ఇందురు తర్ప కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు రూ. 05 లక్షలు, పెద్దమ్మ గుడి నిర్మాణం కోసం రూ 05 లక్షలు మొత్తం 10 లక్షలు ఎస్‌డీఎఫ్ ప్రొసిడింగ్ పత్రాలను టీఎస్ ఆర్టిసి చైర్మన్, నిజామాబాద్ గ్రామీణ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ బుధవారం పంపిణీ చేసినట్టు కురుమ సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కులాల సంఘ సభ్యులకు, ప్రజాప్రతినిధులకు అందించినట్టు పేర్కొన్నారు.

యూనివర్సిటీలో డిమాండ్ డే

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో అల్ ఇండియా యూనివర్సిటీ ఎంప్లాయిస్ కాన్ఫడరేషన్ పిలుపు మేరకు తెలంగాణ యూనివర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో "డిమాండ్ డే " బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సాయాగౌడ్ పాల్గొని మాట్లాడుతూ పెన్షన్స్ స్కీం, స్కేల్ అలవెన్సెస్ టీచింగ్, నాన్ టీచింగ్ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ భాస్కర్, జాయింట్ సెక్రెటరీ వినోద్, ట్రెజరర్ జ్యోతి, ఈసీ మెంబర్స్ శ్రీ వాణి, వైస్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థలో మార్పు కోసం కృషి చేయాలి

మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నవీపేట్

అవినీతి బ్రష్టు పట్టిన పాలనతో తెలంగాణలో అస్తవ్యస్తమైన వ్యవస్థ మార్పు కోసం కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తడగం, అభంగపట్నం, మహంతం గ్రామాలలో కాంగ్రెస్ పార్టీలోకి జిల్లా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సాయరెడ్డి మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి సమక్షంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ నుండి సొంత గూటికి చేరి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు వార్డు సభ్యులు గోపాల్, కళావతి, సతీష్, సంజీవరెడ్డి, యువకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కేవలం మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని అన్నారు. కేసీఆర్ పాలనతో ప్రజలు విసిగి వేసారి పోయారని, అవినీతి ప్రభుత్వాన్ని పారదోలి అభివృద్ధి ప్రభుత్వం కాంగ్రెస్ ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బూతు స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పనిచేసి మేనిఫెస్టోను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు తాహెర్‌బిన్ హందాన్, మండల అధ్యక్షులు సుధాకర్ రావు, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ రాజేందర్ కుమార్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, భగవాన్, గంగాధర్, బాబు, మూస తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఘరానా మోసం

ఆరేంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్

నవతెలంగాణ-భీమ్‌గల్

ధాన్యం కొనుగోళ్లలో ఘరానా మోసం జరుగుతుందని ఆరేంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. మండలంలోని బెజ్జోరా గ్రామంలో బుధవారం ధాన్యం కుప్పలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతున్నాయని మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆయనతో వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో వేల కోట్ల దోపిడీ జరిగిందని, నియోజకవర్గంలోనయితే దోపిడీ జరగందే ధాన్యం కొనుగోలు జరగదని ఆయన అన్నారు.

40 కిలోల సంచికి 6 కిలోల తరుగు తీస్తు రైతుల రెక్కల కష్టం దోచుకుంటున్నారని ఆయన అన్నారు. గ్రామానికి చెందిన గంగరాజు అనే రైతుకు చెందిన 19 సంచులు మాయమయ్యాయని, వాటిని లెక్కలోకి చూపించడం లేదని ఆయన అన్నారు. ధాన్యం అక్రమాలలో మంత్రికి వాటా ఉందని, అక్రమాలు జరుగుతున్నాయని ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని అన్నారు. మంత్రికి రైతులంటే పట్టింపు లేదని, మంత్రి ఏదైనా పని చేయాలంటే అందులో కమిషన్ రావాలని, కమిషన్ లేకుంటే ఆయన పనిచేయడని, ఆయన కమీషన్ల మంత్రి అని విమర్శించారు. పంట కోత కోసి రెండు మూడు నెలలు అవుతున్న ధాన్యాన్ని సేకరించకపోవడం మంత్రి అసమర్థతకు నిదర్శనమని అన్నారు. సొసైటీలను నిర్వీర్యం చేసిన మంత్రి రైతులను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని తెలిపారు. ఈసారి కొనుగోళ్లలో ఎక్కడెక్కడ ఎంత అక్రమాలు జరిగాయో అవన్నీ బయటపెడుతామని తక్షణం రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, సునీల్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీ ప్రకాష్ జవదేకర్‌ని కలిసిన ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నగరంలోని నిఖిల్ సాయి హోటల్ లో కేంద్ర మాజీ మంత్రివర్యులు, రాజ్యసభ సభ్యుడు ప్రకాష్ జవదేకర్‌ను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి బొకే అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల పైన వారి పనితీరుపైన ముచ్చటిస్తు కార్పొరేటర్లకు కొన్ని సూచనలు చేశారు. అర్బన్ నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బసవ లక్ష్మీ నరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనకర్ లక్ష్మీనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ పంచరెడ్డి లింగం, ఉపాధ్యక్షులు నాగొల్ల లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



జవదేకర్‌కు బొకేను అందిస్తున్న ధన్‌పాల్

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఫత్తేపూర్ గ్రామంలో కుక్కల దాడిలో నలుగురికి గాయాలయ్యాయని గ్రామస్తులు బుధవారం తెలిపారు. ఫత్తేపూర్ గ్రామంలో ఇంటి ముందు ఆడుకుంటున్న పది సంవత్సరాల శ్రీజ అనే చిన్నారితోపాటు, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిపాల్, మరో ఇద్దరిపై కుక్కలు దాడిచేశాయని చెప్పారు. గ్రామంలో కుక్కల సంఖ్య పెరిగిందని, వెంటనే సర్పంచ్, అధికారులు స్పందించి కుక్కలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు బాస్కెట్‌ల పంపిణీ

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మాదాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు స్థానిక అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో బాస్కెట్లను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో భాస్కర్, సురేష్, కిరణ్, అరుణ్, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- కళాశాల ప్రిన్సిపాల్ వెంకట రమణ

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకట రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన బాలుర గురుకుల కళాశాలలో సి.ఇ.సి, యచ్.ఇ.సి, ఏ అయిండ్ టి గ్రూప్‌లకు మొదటి సంవత్సరం గ్రూపుల యందు ఖాళీలున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 15 నాటికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరుటకు అడ్మిషన్స్ తేదీ గడువు ముగుస్తుందని తెలిపారు. కావున విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా త్వరగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా సూచించారు.

నవతెలంగాణ

కామారెడ్డి

3

గురువారం 15 జూన్ 2023

మీ ఆరోగ్యం నా బాధ్యత

- ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-తాడ్వాయి

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా 'మీ కోసం నేనున్నా.. మీ ఆరోగ్యం-నా బాధ్యత' అని కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కృష్ణాజివాడి గ్రామానికి ఉదయం 8.00 గంటలకు ఉచిత గ్రామీణ సంచార వైద్యశాల ద్వారా గ్రామంలో ప్రజలకు డాక్టర్ వచ్చి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో తప్పిపోయిన బాలుడు(11) బుధవారం ఏడుస్తూ కనబడగా లింగంపేట్ బ్లూ కోల్ట్ సిబ్బంది బుధవారం తల్లిదండ్రులకు అప్పగించారు. ఏడుస్తూ కనిపించిన బాలుడిని బ్లూ కోల్ట్ సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అతని పేరు అడగగా బోల్లు శశాంత్ అని, తమ అమ్మనాన్న దేవునిపల్లిలో ఉంటారని చెప్పగా వెంటనే వాళ్ళ వివరాలు పోలీసులు సేకరించి బాలుడి తండ్రి అయిన బొల్లు కుమార్‌కు పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ బాలుడు రెండు రోజుల క్రితం వాళ్ళ అమ్మమ్మ ఊరు భవానీపేట్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి తమ గ్రామం దేవునిపల్లికి వెళ్లే క్రమంలో లింగంపేట్‌లో తప్పిపోయాడని తెలిపారు.

భవానీపేట్‌లో రక్తదాన శిబిరం

- 31 యూనిట్ల రక్తదానం
- రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రం అందజేసి సన్మానం



రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేత.. సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో భవానీపేట్ గ్రామంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు మండల రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు బొల్లు శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని భవానీపేట్ గ్రామంలో ఎంపీటీసీ సురేందర్, సర్పంచ్ ఆకుతోట నరసమ్మ ప్రకాష్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరానికి గ్రామంలోని 31 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మొదటిసారి రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన రక్త దాతలు 25 మంది యువకులను రెడ్‌క్రాస్ సొసైటీ వారు గ్రామ పెద్దల చేతుల మీదుగా శాలువాతో సన్మానం చేసి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆకుతోట నరసమ్మ ప్రకాష్, ఎంపీటీసీ సురేందర్ మాట్లాడుతూ మారుమూల గ్రామాలలో రక్తదానం చేయడంపై ఉన్న అపోహలను తొలగిస్తూ తాము సైతం రక్తదాతలమవుతామని ముందుకు వచ్చిన గ్రామ యువకులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సురేందర్, సర్పంచ్ ఆకుతోట నర్సమ్మ ప్రకాష్, కార్యదర్శి అశోక్, వీఆర్ఏ కాశీరాం, గ్రామ పెద్దలు సంజీవులు, కత్తూరి పొశం, కత్తురి ప్రవీణ్, రాజు కత్తూరి, ధనరాజ్, మదర్ పాషా, మండూరి రాజు, చిలుక ప్రవీణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పోరుబాట

- ఐసీడీఎస్, అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేసేందుకు పాలకుల కుట్ర
- తిప్పికొట్టేందుకు ఆందోళనలు
- సీఐటీయూ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జీపు జాత
- 19న నిజామాబాద్, బాన్సువాడలో జాత.. బహిరంగ సభలు
- 20న కామారెడ్డి మీదుగా మెదక్‌కు..
- జయప్రదం చేయాలని నాయకుల పిలుపు

నవతెలంగాణ-పిట్లం

ఐసీడీఎస్‌కు బడ్జెట్ కుదించి, నూతన జాతీయ విద్యా విధాన చట్టం 2020 ప్రవేశపెట్టి అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు పోరుబాటకు సిద్ధమవుతున్నారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 16న తలపెట్టిన జీపు జాత.. 19న నిజామాబాద్ మీదుగా బాన్సువాడకు చేరనుంది. బాన్సువాడలో సాయంత్రం బహిరంగ సభ నిర్వహించనున్నారు. అనంతరం 20వ తేదీనా కామారెడ్డి జిల్లా కేంద్రం మీదుగా మెదక్ వెళ్లనుంది. ఉమ్మడి జిల్లాలో జరిగే జీపు జాత, బహిరంగ సభలను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు పూర్తవుతున్నా అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను ఏ ఒక్కటి పరిష్కారం చేయలేదు. పెట్రోల్, డీజిల్ గ్యాస్, నిత్యవసర సరుకుల అనేక రేట్లు పెరిగినా ధరలకు అనుగుణంగా కేంద్రం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచడంలో కాలయాపన చేస్తుంది. గతంలో అంగన్వాడీలు దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు చేస్తే 2018 సంవత్సరంలో టీచర్లకు 1500ల రూపాయలు, హెల్పర్లకు 750, మినీ అంగన్వాడీలకు 1250 రూపాయలు పెంచినప్పటికీ తన వాటా బడ్జెట్‌ను 40 శాతం తగ్గించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం వీటిని చెల్లించడం సాధ్యం కాదని అమలుపరచలేక పోయారు. వేతనాలే కాకుండా బడ్జెట్ తగ్గింపు వల్ల యావత్తు ఐసిడిఎస్ సేవలకు అంతరాయం కలుగుతుంది.

పక్కా భవనాలు , పోషకాహారం , అద్దె భవనాలు , మెను చార్జీలు , ఖాళీ పోస్టులు , టి ఎ , డి ఎ తదితర సమస్యలు పరిష్కారం కాకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడి అన్న చందంగా కొనసాగుతున్నాయి. 2013లో 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ స్కీం వర్కర్లకు కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం , పెన్షన్ , ఈఎస్ఐ , ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్వాడి ఉద్యోగులు డిమాండ్ చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం 9 సంవత్సరాల నుండి అమలు చేయడంలో విఫలమవుతుంది. 2022లో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా అంగన్వాడీ ఉద్యోగులకు 1972 చట్ట ప్రకారం గ్రాట్యూటీకి అర్హులని , వెంటనే గ్రాట్యూటీని అంగన్వాడీ ఉద్యోగులకు చెల్లించాలని కోర్టు ఆదేశించి సంవత్సరం దాటినా గ్రాట్యుటీపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయం. పైగా 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టింది. లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే అంగన్వాడీ ఉద్యోగుల హక్కులు ప్రమాదంలో పడనున్నాయి. కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తుంది.

రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు పూర్తయిన కాలంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయడం లేదు. 2017 నుండి అంగన్వాడీ ఉద్యోగులకు టిఏడిఎ చెల్లించడంలో విఫలమైంది. 2018లో కేంద్ర ప్రభుత్వము పెంచిన వేతనాలను నేటికీ చెల్లించలేక పోయింది. 2015 నుండి మెస్ చార్జీలు పెంచలేక, సకాలంలో వేతనాలు, బిల్లులు అందించడంలో విఫలమైంది. ఆన్‌లైన్ ద్వారా అనేక యాప్‌లు పెట్టి పని భారాన్ని పెంచింది.

ఇటు కనీస వేతనము లేక అటు సంక్షేమ పథకా లు అమలు కాక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో పోరుబాట పడుతున్నారు. ఈ నెల 19న బాన్సువాడ డివిజన్ కేంద్రంలో జీపు జాత, బహిరంగ సభ నిర్వహించనున్నారు. అంగన్‌వాడీ టీచర్‌లు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిస్తున్నారు.

19న జీపు జాతను విజయవంతం చేయాలి

- రవీందర్. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు



అంగన్‌వాడీ ఉద్యోగుల పై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల తిప్పికొట్టడానికి ఈ నెల 19న బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కొనసాగనున్న జీప్ జాత , బహిరంగ సభను అంగన్ వాడి టీచర్లు, ఆయాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీలు పెద్దఎత్తున తరలిరావాలి

- కె.రాధ. యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి



తమ డిమాండ్ల సాధనకై ఈనెల 19 న డివిజన్ కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన జీప్ జాత, బహిరంగ సభను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్క టీచరన్, ఆయాలు పెద్ద ఎత్తున తరలిరావాలి. బహిరంగ సభలో అంగన్‌వాడీ డిమాండ్స్‌పై వ్యక్తలు దశ, దిశ నిర్దేశించనున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనం అందేనా..?

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలు ప్రారంభమై 4 రోజులు గడుస్తున్నా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టడం లేదు. ఓ పక్క ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నామని గొప్పలు చెప్పుకుంటూ పోతుంది. కానీ అది కృష్ణాజివాడి గ్రామంలో కనిపించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయులు చొరవ చూపి మధ్యాహ్న భోజన కార్మికులతో చర్చించి సకాలంలో విద్యార్థులకు పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం పెట్టేలా చూడాలని కోరుతున్నారు.



ఇంటినుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు (ఫైల్)

ఇంటింటా ఓటర్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- ఎమ్మార్వో రాజేశ్వర్

నవతెలంగాణ-లింగంపేట్



ఓటర్ సర్వే చేస్తున్న తహసీల్దార్

గ్రామాల వారీగా బీఎల్వోలు ఓటర్ పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలని ఎమ్మార్వో చంద్ర రాజేశ్వర్ సూచించారు. బుధవారం మండలంలోని అయ్యపల్లి, శెట్టిపల్లి, పరమళ్ళ గ్రామంలో ఓటర్ పరిశీలనను పర్యవేక్షించారు. బీఎల్‌వోలు ఓటరు పరిశీలన ఇంటింటికి వెళ్లి ఇంటి పేరు ఓటర్ పేరు ఫోటోలు తప్పులు ఉన్నట్లయితే వెంటనే వాటిని సరి చేసుకోవాలన్నారు. చనిపోయిన వారి పేర్లను తొలగిస్తూ కొత్తగా వచ్చిన వారి 18 సంవత్సరాలు నిండిన వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఆయన వెంట వీఆర్‌ఏ అడ్డి రవి, బాలరాజు తదితరులున్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

నవతెలంగాణ-లింగంపేట్/జుక్కల్



జుక్కల్ : అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో సామూ హిక అక్షరా భ్యాస కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కొత్తగా పాఠశాలలో చేరిన పిల్లలతో సామూహిక అక్షరా భ్యాసం చేయించారు. ఇందులో భాగంగా సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాలవేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనిల్‌రెడ్డి ప్రధానోపాధ్యాయులు బాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలే పిల్లల భవితకు పునాదులు అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే వారిని ఆట పాటలతో ఆనంద పర్చడమే కాకుండా ఆంగ్లంలో మంచి విద్యాబోధన చేస్తున్నట్టు తెలిపారు. సంస్కృతీ, సంప్రదాయాలకు విద్యా మందిరాలు నిలయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అని, చదువుతోపాటు సంస్కారం నేర్పుతున్నామన్నారు. అనంతరం ఉచితంగా పలకలను పంపిణీ చేసి అక్షరాలు పెట్టించి, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాల్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ కిషన్ ప్రసాద్, ఉపసర్పంచ్ సాయిలు, నాయకులు కిషోర్‌రెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ శ్రీనివాస్, సుమలత, అంగన్‌వాడీ కార్యకర్త సావిత్రి పాల్గొన్నారు.

వజ్రఖండి ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాసం చేయించిన సర్పంచ్..

జుక్కల్ : మండలంలోని వజ్రఖండి ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ సంజీవ్ పాటిల్ విద్యార్థులకు అక్షరభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొదటగా పాఠశాల అవరణలోని చదువులతల్లి సరస్వతి దేవి విగ్రహనికి హెచ్‌ఎం రోషిత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పిల్లలకు, వారి తల్లిదండ్రులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవ్ పాటీల్, హెచ్‌ఎం రోషిత్, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

నవతెలంగాణ-గాంధారి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గాంధారి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పల్లెప్రగతి కార్యక్రమం సందర్భంగా ర్యాలీ, జెండావిష్కరణ కార్యక్రమం ఉంటుందని, కావున గ్రామస్తులందరూ తప్పకుండా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ గ్రామ ప్రజలను కోరారు.

అక్రమ కట్టడాలను అరికట్టాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని సబ్దల్‌పూర్ గ్రామస్తులు అక్రమ కట్టడాలు అరికట్టాలని బుధవారం పలు అధికారులకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. సబ్దల్పూర్ గ్రామ శివారులో గత శతాబ్ద కాలం నుంచి హనుమాన్ ఆలయం ఉందని, కానీ ఈ ఆలయ ఆవరణంలో వేరే మతానికి చెందిన కొందరు అక్రమ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారని తెలిపారు. కావున వెంటనే అక్రమ నిర్మాణాలను ఆపాలని కోరారు.

అందరి ఆరోగ్యమే సర్కార్ ధ్యేయం

- ప్రతి పల్లెకూ దవాఖానా సేవలు
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-విలేకరుల బృందం



నసురుల్లాబాద్ : మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



జుక్కల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నసురుల్లాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే సీఎం కేసీఆర్ ధ్యేయమని, బాన్సువాడ నియోజకవర్గ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండడమే తన లక్ష్యమని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం బాన్సువాడ పట్టణంలోని మీనా గార్డెన్‌లో నిర్వహించిన వైద్యారోగ్య దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్పీకర్ మాట్లాడుతూ.. 'గతంలో ఆనాడు పేదోళ్లకు పెద్ద జబ్బు చేస్తే ప్రాణాలపై ఆశలు వదులుకునేవారు. గర్భిణులు ప్రసవానికి ప్రభుత్వాస్పత్రికి వెళ్లడానికి జంకేవారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు ఖర్చయినా పరవాలేదు ప్రైవేటు ఆస్పత్రులకు వెళదామనేవారు. కానీ.. ఇప్పుడు పరిస్థితి మారింది. ఏ రోగమొచ్చినా ప్రభుత్వ ఆస్పత్రులకే వెళదామంటున్నారు. గర్భిణులు ప్రసవానికి ముందుగానే సర్కారు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. సుఖప్రసవాలు చేయించుకుంటున్నారు. కేసీఆర్ కిట్లు, నగదు సాయం అందుకుంటున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు ఆ బాధలోనూ ప్రభుత్వ ఆస్పత్రులకే పోదామంటున్నారు. వీటన్నింటికీ కారణం.. ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత వైద్యారోగ్య శాఖలో తెచ్చిన విప్లవాత్మక మార్పు. సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు సర్కారు ఆస్పత్రులపై నమ్మకం కలిగేలా కార్పొరేట్ వైద్యానికి నాంది పలికారు. కిడ్నీ డయాలసిస్.. గుండె ఆపరేషన్లు.. ఐసీయూ, వెంటిలేషన్ వంటి సౌకర్యాలు కల్పించారు. పల్లె, బస్తీ దవాఖానలు ఏర్పాటు చేసి ప్రజల ముంగిట్లోకి వైద్యాన్ని తీసుకొచ్చారు. తాజాగా బాన్సువాడ పట్టణంలో రెండు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయించాం'. అని తెలిపారు. ఈ సందర్భంగా కంటి వెలుగు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ లబ్ధిదారులు, డయాలసిస్ పేషెంట్లు తమ అనుభవాలను, తాము ప్రభుత్వం నుంచి పొందిన సేవలపై సభలో వివరించారు. సీఎం కేసీఆర్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో వైద్య, ఆరోగ్య శాఖకు రూ.11,000 కోట్లు కేటాయించారని తెలిపారు. దేశంలో 4000 పడకలు కలిగి ఉండే ఆసుపత్రి నిమ్స్ ఒక్కటే అవుతుందన్నారు. వరంగల్‌లో 2000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంలో ఉన్నదన్నారు. గతంలో రాష్ట్రంలో 3 డయాలసిస్ కేంద్రాలు ఉంటే నేడు 26కు పెరిగాయని తెలిపారు. 2014కు ముందు రాష్ట్ర ఆసుపత్రులలో బెడ్ల సంఖ్య 8వేలు అని, ప్రస్తుతం 27,700 బెడ్లతో ఆసుపత్రిలు ఏర్పడినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి లక్ష్మణ్ సింగ్, ఆర్డీఓ రాజాగౌడ్, బాన్సువాడ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.శ్రీనివాస ప్రసాద్, డాక్టర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, బాన్సువాడ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు వివిధ మండల ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

వైద్యం అందరికీ అందించాలన్నదే ప్రభుత్వం లక్ష్యం..

వర్ని : పేద, ధనిక తేడా లేకుండా ఉచిత వైద్యం అందించాలన్నదే కేసీఆర్ లక్ష్యమని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం వర్ని మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి నూతన భవనానికి ఆయన భూమి పూజ చేశారు.

జిల్లా వైద్యాధికారిపై ఆగ్రహం..

వర్ని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు డిప్యూటేషన్ వారే ఉన్నారని, స్థానిక ఏఎన్ఎంలు ఆసుపత్రిలో అందుబాటులో ఉండటం లేదని స్థానిక ప్రజలు తెలుపడంతో పాటు జిల్లా వైద్య అధికారి సుదర్శనం సభకు లేటుగా రావటంతో స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నీ పోస్టులు పర్మినెంట్‌గా ఉండేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు, ఏఎంసి వైస్ చైర్మన్ గోపాల్, పిఎసిఎస్ చైర్మన్ నామాల సాయిబాబా, ఉప సర్పంచ్ కంది కృష్ణ, కనుకరెడ్డి, కో ఆప్షన్‌మెంబర్ కరీం, మైనార్టీ అధ్యక్షులు హైమద్, డైరెక్టర్ గఫర్, ప్రచార కార్యదర్శి సత్తార్, ఎంపీటీసీలు సాయిలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరుపడకలుగా ఉన్న ఆసుపత్రి 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు.

ఆరోగ్య తెలంగాణే ముఖ్యమంత్రి అభిమతం..

జుక్కల్ : ఆరోగ్య తెలంగాణే ముఖ్యమంత్రి కేసీఆర్ అభిమతమని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్ అన్నారు. బుధవారం జుక్కల్ మండల కేంద్రంలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, ఎంపీ బీబీ పాటిల్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ వేరుబడిన తరువాత ఆసుపత్రులు నిర్మాణాలు, మండలానికో 30 పడకల ఆసుపత్రి, వైద్యశాఖలో నూతన వైద్యులకు రిక్రూట్‌మెంట్ చేయడంతో పాటు ఆశాలకు జీతాలు పెంచినట్టు తెలిపారు. మహిళల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి వారి ఆరోగ్యం పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ.. ముఖ్యమంతి వైద్యఆరోగ్యశాఖ దశ దిశ మార్చారని గ్రామాలలో ఆరోగ్యకేంద్రాలు, పట్టణాలలో బస్తీ దవఖానాలు, పట్టణ దవఖానాలు ఏర్పాటు చేసి సిబ్బంది నియమాకం చేసి అన్ని జబ్బులకు ఉచితంగా వైద్యం అందిచడమే కాకా మహిళలకు పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎంపీ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో దేశానికి ఆదర్శం తెలంగాణ..

ఎల్లారెడ్డి : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణ పరిశీలించి వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేందర్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు రోగుల పట్ల ఇంత శ్రద్ధ తీసుకోలేదని తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వాసుపత్రిలో సరైన వైద్యం, ప్రసవాల సంఖ్య కూడా పెరిగిందని ఆయన అన్నారు. దేశానికి వైద్య రంగంలో తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్లు రాము, నీలకంతం, నాయకులు నునుగొండ శ్రీనివాస్, తిరుపతి, పోచయ్య శ్రవణ్, రాజు, అధిములం సతీష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర మోహన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి : పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బోధన్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం బోధన్ పట్టణంలోని ఆప్నా ఫంక్షన్ హాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య దినోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సతీమణి ఆయేషా ఫాతిమా, ఎంపీపీ బుద్దె సావిత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గర్భిణీల కోసం, బాలింతల కోసం ఎన్నో ఉపయోగకరమైన పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. గర్భిణీగా ఉన్న కాలంలో తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం ప్రభుత్వం నాణ్యమైన ఆహారం అందించడం కోసం న్యూట్రిషన్ కిట్లను అందిస్తుందని దానిని గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, నవీపేట్ ఎంపీపీ శ్రీనివాస్, ఐసీడీఎస్, వైద్య సిబ్బంది దితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య దినోత్సవం కార్యక్రమాన్ని వైద్యులు, వైద్య సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ సురేష్, ఉపసర్పంచ్ విట్టల్, ఎంపీటీసీ కుటుంబ సభ్యులు రచ్చ కుశాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్ జాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్యారోగ్య శాఖను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తుందని రోగులకు కావలసిన సౌకర్యాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. ఆస్పత్రిలో చికిత్సలు పొందే రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

టీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ టిఎస్ఆర్టీసీ డిపో యందు ఎంప్లాయిస్ యూనియన్ తొమ్మిదవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి రవి చందర్, అర్గుల్ రమేష్ లు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి యూనియన్లను పునరుద్ధించాలని, రెండు పీఆర్సీలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏ హనుమాన్లు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిసిఎస్ ప్రసాద్, గోపి, శీను, గంగవ్వ, లక్ష్మి, గోపాల్, రాములు, నరసయ్య,, లక్ష్మీపతి, మహేష్, తదితరులు పాల్గొన్నారు..

గడ్డివాము దహనం

● రూ.లక్ష ఆస్తి నష్టం

నవతెలంగాణ-ఎడపల్లి



దహనమవుతున్న గడ్డివాము

మండలంలోని జానకంపేట్ గ్రామానికి చెందిన మజీద్ అనే వ్యక్తి గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు మాజీద్ తెలిపారు. మజీద్ అనే రైతు పశువుల కోసం వంద ఎకరాల గడ్డిని కొని గడ్డివాము చేసి ఉంచాడు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించగా పూర్తిగా గడ్డివాము దహనమైంది. ఫైర్ ఇంజన్‌తో మంటలార్పినా లాభం లేకుండా పోయింది.

తెలంగాణలో వైద్య సేవలు మెరుగుపడ్డాయి

● వైద్య ఆరోగ్య దినోత్సవంలో డిప్యూటీ డీహెచ్ఎంఓ

నవతెలంగాణ-మోర్తాడ్/కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్రంలో వైద్య సేవలు మెరుగుపడ్డాయని డిప్యూటీ డిహెచ్ఎంఓ రమేష్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో జరిగిన వైద్య ఆరోగ్య దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2014 కంటే ముందు వైద్య శాఖలో పూర్తిగా రోగులకు సేవలు అందేవి కావని, ఇప్పుడు కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందడానికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, రోగులకు ఉచిత మందులతో పాటు గర్భిణులకు సేవలందిస్తుందని అన్నారు. వైద్య శాఖ ద్వారా కంటి వెలుగు ఏర్పాటు చేసి ఎంతోమందికి కంటి చూపు మెరుగుపడేలా చేసిందని, గర్భిణులు, బాలింతలకు కేసీఆర్ కిట్టు, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత డెలివరీలు అయ్యేలా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.



మోర్తాడ్ : మాట్లాడుతున్న డిప్యూటీ డిహెచ్ఎంఓ రమేష్



అన్నదాన్నలో పాల్గొన్న ఎమ్మెల్యే

కార్యక్రమంలో డిసిఓ సింహాచలం, సర్పంచ్ ధరణి, ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పిటిసి రవితో పాటు నియోజకవర్గ వైద్యులు, నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

కంఠేశ్వర్: నిజామాబాదు జిల్లా రెడ్ క్రాస్ రక్త కేంద్రం గత శనివారం ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైసెషన్ వారు వచ్చి తనిఖీ చేసి రెడ్ క్రాస్ సంస్థ వివరాలు, చేపడుతున్న కార్యక్రమాలు అలాగే రెడ్ క్రాస్ రక్త కేంద్రం పరిశుభ్రత , రక్త సేకరణ నాణ్యత పరిమాణాలు తనిఖీ చేసి ఐఎస్ఓ సరిఫికెట్ జారీ చేసింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాజ్ భవన్‌లో చేపట్టిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ నిజామాబాద్ జిల్లా రెడ్ క్రాస్ కార్యవర్గాన్ని ప్రశంసిస్తూ నిజామాబాద్ జిల్లాశాఖ రెడ్ క్రాస్ చైర్మన్ బుస్స ఆంజనేయులుకు ఐఎస్ఓ పత్రం బుధవారం అందజేశారు. అలాగే రెడ్ క్రాస్ లో ఎక్కువ సార్లు రక్త దానం చేసిన నిజామాబాదు జిల్లా కోర్టు ఉద్యోగి కే.నాగేందర్‌ను జ్ఞాపికతో ప్రశంసిస్తూ మున్ముందు కూడా ఇలానే రక్త దానం చేస్తూ యువతకి స్ఫూర్తి నివ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్ కోశాధికారి కరిపే రవీందర్ పాల్గొన్నారు.

లయన్ చెన్న రవికుమార్‌కు సన్మానం



రవికుమార్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో లయన్స్ ప్రెసిడెంట్ లయన్ చెన్న రవికుమార్‌ని క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు లయనిస్ట్ 2022 - 2023 గాను చేసిన సేవలను గుర్తించి క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ ,సర్వీస్ ఆక్టివిటీస్, పెర్మినెంట్ ప్రాజెక్ట్ ఐ క్యాంప్స్, ఐ సర్జీరీస్ తదితర సేవలను ఆయన నిర్విరామంగా కొనసాగించారన్నారు. రాష్ట్ర పద్మశాలి సంఘంలో కార్యదర్శి పదవి రావడం అభినందనీయమని క్లబ్ సభ్యులు అన్నారు. కార్యక్రమంలో సెక్రెటరీ ఏ చిన్న రెడ్డి, ట్రెజరర్ డి ఉదయ్ కుమార్, ఎం మోహన్ దాస్, రఫీ గోహార్, జీవి నరసింహారెడ్డి, వెంకట్రామిరెడ్డి, అంబల్ల తిరుపతి, సడక్ శ్రీనివాస్, కృష్ణ పండిత్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అడ్లూరి శ్రీనివాస్‌కు ఘన సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్న అడ్లూరి శ్రీనివాస్‌ను న్యాయవాదులు బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోధన్ శక్కర్‌నగర్‌కు చెందిన న్యాయవాది అడ్లూరి శ్రీనివాస్ బీజేపీ తెలంగాణా రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నియామకమైన సందర్భంగా ఆయనను సన్మానించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో ఉన్నత పదవులు పొంది బోధన్‌కు పేరు ప్రతిష్టలు సాధించాలన్నారు. అలాగే బోధన్ అభివృద్ధికి పాటు పడాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నందకుమార్, మాజీ అధ్యక్షుడు ఎం. గంగారెడ్డి, కోశాధికారి సమయ్య, న్యాయవాదులు సిహెచ్.వి.హన్మంతరావు, అర్జున్ ర్యాండర్, తర్ల శంకర్, బాణోత్ రమేష్, వడ్ల ప్రకాష్, జెల్లాశ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివసేన పార్టీ కార్యకర్తల సమావేశం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న గోపి కిషన్

నవతెలంగాణ-బోధన్

జూన్ 16వ తేదీన బోధన్ పట్టణంలోని ఎస్ఎస్ కన్వేషన్ హాల్‌లో నిర్వహించే శివసేన పార్టీ కార్యకర్తల సమావేశానికి కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పసులేటి గోపి కిషన్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యకర్తల సమావేశానికి శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శింకారు శివాజీ హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు శింకారు జీవాజీని శుక్రవారం ఉదయం 10 గంటలకు బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి కమాన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా, అక్కడి నుంచి మర్రీ మైసమ్మ టెంపుల్ ఎదురుగా గల ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో జరిగే సభా కార్యక్రమం వరకు భారీ ర్యాలీలో స్వాగతం పలకనున్నట్టు వివరించారు. సమావేశంలో భూమేష్, ప్రీతం, గౌతమ్, పడాల శ్రీనివాస్, శ్రీకాంత్, బిల్లా విజయ్, లోకేష్, రాజు, లింగం, నాగరాజు, సాగర్, సతీష్ పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో సంతకోసం స్థల పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో పంచాయతీ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి బుధవారం సంత (అంగడి) నిర్వహణకు నిర్ణయించారు. ఈ మేరకు గ్రామంలో సంత నిర్వహణ కోసం సర్పంచ్ సక్కారం అశోక్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని పోచమ్మ గుడి వద్ద సంత నిర్వహణకు స్థలం అనుకూలంగా ఉంటుందని నిర్ణయించారు. ఇకనుండి ప్రతివారం బషీరాబాద్ గ్రామంలో సంత నిర్వహించనున్నట్లు సర్పంచ్ సక్కారం అశోక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఇకనుండి ప్రతి సాయంత్రం నాలుగు గంటలకు సంత ప్రారంభమవుతుందని చెప్పారు. సంతను గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తోట జ్యోతి మనోహర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆకుల బజాన్న, వార్డు సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు రమేష్, తోట అప్పయ్య, మురళి పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ అశోక్

ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి

● పీవైఎల్ డిమాండ్

నవతెలంగాణ-బోధన్

భారత రెజ్లర్ల సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో బోధన్ ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ హుస్సేన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గత 3నెలలుగా మహిళా క్రీడాకారులు రెజ్లర్ల సంఘం అధ్యక్షుడు ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ ఆందోళన నిర్వహించినా.. కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సరైంది కాదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిన క్రీడాకారుల పట్ల చిన్న చూపు చూడటం దురదృష్టకరమన్నారు. బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల చట్టం కింద కేసు నమోదు చేసి, ఎంపీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లు చేస్తున్న ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బేటి బచావో-బేటి పడావో నినాదం ఆచరణలో విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు సురేష్, సందీప్, కిరణ్, పోశేట్టి, సాయిలు తదితరులు ఉన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నేలలో పోషకాలు ఉంటే అధిక దిగుబడి

నవతెలంగాణ-సదాశివనగర్

భారతీయ వరి పరిశోధన స్థానం రాజేంద్రనగర్, హైదరాబాద్ వారి సహకారంతో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అడ్లూరు ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో భూసార పరీక్ష ఆవశ్యకతపై షెడ్యూల్ కులాల రైతులకు శిక్షణ, కిట్ల పంపిణీ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ బజేంద్ర మాట్లాడుతూ.. నేలలో ఉండాల్సిన పోషకాలు సమపాళ్లలో ఉన్నప్పుడు పంటల సాగులో పెట్టే పెట్టుబడులు తగ్గి మంచి దిగుబడులు పొందే అవకాశం ఉందని అన్నారు. రైతులు విధిగా తమ నేల పరీక్షలు జరిపి పోషక లోపాలు సరి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు స్థాయిలో ప్రధాన పోషకాలు నత్రజని, పొటాష్, భాస్వరం ఉందని స్థాయి పరీక్ష చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. అలాగే సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.. ఫౌండేషన్ ద్వారా రైతులకు చేస్తున్న సేవలు వివరించి కార్యక్రమానికి హాజరైన రైతులకు నేల సారవంతానికి చేపట్టాల్సిన చర్యలు వివరించారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో కె.వి.కే శాస్త్రవేత్త నవీన్ కుమార్ పాల్గొని పంటల సాగు విధానంలో అనుసరించాల్సిన పద్ధతులు వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సొసైటీ చైర్మన్ మర్రి సదాశివరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇంకా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడానికి సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ముందుకు రావాలని తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో భారతీయ వరి పరిశోధన సంస్థ సాంకేతిక నిపుణులు శ్రీకాంత్, రైతుబంధు అధ్యక్షులు బాలరాజు, సొసైటీ డైరెక్టర్లు భాస్కర్, బత్తుల రాములు, రాజేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్ధిరాములు, వీడీసీ అధ్యక్షుడు నర్సింలు, నాయకులు మహేందర్‌రెడ్డి, ఏఈఓ శ్రీనివాసరెడ్డి, రైతులు ఆసరాజయ్య, నంశ గారి అశోక్, సీతగారి నరసింహులు, ఆస శంకర్, ఆస మహేష్, ఆసరాజు, శ్రీనివాస్‌రెడ్డి, సంకరి శ్రీనివాస్, ఎల్లగారి రాజయ్య ఆయిండ్ల రాజు, సొసైటీ సిబ్బంది సెక్రటరీ బైరయ్య లింగమూర్తి, బైరష్, గంగరాజు, నవీన్, రాజు, చందు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న పలువురు

నీట్‌లో సత్తా చాటిన విజయసాయి విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్

నీట్ పరీక్ష ఫలితాలలో బోధన్ పట్టణంలోని విజయసాయి విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో తమ సత్తాను చాటారు. 2020-21 విద్యా సంవత్సరంలో శ్రీ విజయ సాయి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి అభ్యసించిన విద్యార్థులు 2023 సంవత్సరం నీట్ పరీక్ష ఫలితాలలో ప్రభంజనం సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, మేనేజర్ చక్రవర్తి తెలిపారు. 720 మార్కులకు గాను 579 మార్కులు ఆల్ ఇండియా 42 వేల ర్యాంకును సాధించిందని, ప్రశాంతి 473 మార్కులు, ఎస్సీ కేటగిరీలో ఆల్ ఇండియా 7వేల ర్యాంకును సాధించిందని, పూజ 408 మార్కులు సాధించి ఎస్టీ కేటగిరీలో ఆల్ ఇండియాలో 3500 ర్యాంకును సాధించినట్లు వారు తెలిపారు. విద్యార్థులు సాధించిన విజయాలు తమకు ఎంతో గర్వకారణమని, పటిష్టమైన ప్రణాళికతో విజయాన్ని సాధించవచ్చని నిరూపించారని తెలిపారు. వారి విజయానికి కారకులైనటువంటి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.




కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేసిన మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

నాయి బ్రాహ్మణ సంఘం కమిటీ హాల్, నీలకంఠేశ్వర ఆలయం ప్రహరీ నిర్మాణానికి ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ప్రతి కుల సంఘానికి 10 లక్షల రూపాయలు వ్యయంతో వివిధ సంఘాల కమిటీ హాల్‌కు నిధులు స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ మంజూరు చేయించారని తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని నీలకంఠేశ్వర ఆలయం ప్రహరీ గోడకు ఐదు లక్షల రూపాయలు వ్యయంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీవన్, మున్సిపల్ ఏఈ వినోద్, బీఆర్ఎస్ ఎల్లారెడ్డి అధికార ప్రతినిధి రామప్ప, నాయీ బ్రాహ్మణ ఎల్లారెడ్డి అధ్యక్షులు కుసలకంటి మహేష్, శ్రీనివాస్, పాండు, సంతోష్ దశరథం, సంఘం సభ్యు లు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న చైర్మన్

రెడ్ క్రాస్ రక్త కేంద్రానికి ఐఎస్ఓ గుర్తింపు

● గవర్నర్ ద్వారా ఐఎస్ఓ పత్రం అందుకున్న రెడ్‌క్రాస్ కార్యవర్గం



ఐఎస్ఓ పత్రం అందుకుంటున్న రెడ్‌క్రాస్ బృందం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే గణేష్ బిగాల బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుచేసుకున్న మహిళలకు కేసీఆర్ కిట్ ని అందచేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. కడుపు కోత లేకుండా సాధ్యమైనంత వరకు ఎక్కువ సాధారణ ప్రసవాలు చేస్తున్న వైద్య సిబ్బందిని అభినందించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఏర్పాటు చేసిన కేసీఆర్ బువ్వ కుండ" కేంద్రంలో రోగులకు వారి సహాయకులకు భోజనాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మీ, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకురాలు ప్రతిమ రాజ్ రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర, డిఎంహెచ్ఓ సుదర్శనం, కార్పొరేటర్లు బైఖాన్ సుధ మధు, అబ్దుల్ కుద్దుస్, బబ్బ్యూ ఖాన్, ఉమారాణి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు పంటష్టనష్టపరిహారం ఏది..?

● రైతుసంఘం



మాట్లాడుతున్న కంజర భూమయ్య

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం చెల్లిస్తానన్న నష్టపరిహారం ఏది అని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య అన్నారు. బుధవారం సిపిఐ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య మాట్లాడుతూ.. రైతాంగానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని, అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ చేస్తానని హామీని ఇప్పటికీ అమలు చేయలేదని అన్నారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చి రైతులకు ఇబ్బందిపాలు చేస్తున్నాడని, గత నెలలో అకాల వర్షాలు మూలంగా పంట నష్టపోయిన రైతాంగానికి 10వేల రూపాయలు చెల్లిస్తానని హామీ ఇచ్చి, ఎక్కడ నష్టపరిహారం ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలుచేసి రెండు నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించలేదని, బ్యాంకులలో అక్కడక్కడ వడ్ల బిల్లులు వస్తే, బ్యాంకర్లు క్రాప్‌లోన్ చెల్లించిన తర్వాతనే ధాన్యం డబ్బులు ఇస్తామని రైతులపై ఒత్తిడి తేవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి అడ్డికే రాజేశ్వర్, నాయకులు దేవేందర్, రాజు పాల్గొన్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మండల పరిషత్, కార్యాలయంలో అధ్యక్షులు పస్క నర్సయ్య అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం ఈనెల 16న నిర్వహించనున్నట్టు అని ఎంపీడీవో శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11గంటలకు సమావేశం ఉంటుందని, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

వైద్య సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

● కాంగ్రెస్ నాయకుల ధ్వజం

నవతెలంగాణ- ఆర్మూర్

పట్టణ వంద పడకల ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు కల్పించడంలో స్థానిక నాయకులు విఫలం అయ్యారని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా నాయకులు కోలా వెంకటేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజల ఆరోగ్యంకోసం ఎటువంటి వైద్య సదుపాయాలు కల్పించారని ఉత్సవాలు చేస్తున్నారని ప్రశ్నించారు. పట్టణంలో వంద పడకల ఆసుపత్రి తెచ్చానని అంటున్నా కొద్ది నెలల క్రితం 100 పడకల ఆసుపత్రిగా మారుస్తూ వైద్య విధాన పరిషత్‌లో చేర్చుతు ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాయని అన్నారు. 30 పడకల ఆసుపత్రి కంటే అధ్వానంగా ఉందని తెలిపారు. 100 పడకల ఆసుపత్రిలో ఉండవలసిన వసతుల్లో అందులో కనీసం 5శాతం కూడాలేవన్నారు. 44మంది డాక్టర్లు ఉండాల్సింది 12 మందే ఉన్నారని, వారిలోనూ 80శాతం డిప్యుటేషన్‌పై వచ్చిన వారే అని అన్నారు. నర్సులు 40కి పైగా ఉండాల్సి ఉండగా 15 లోపు మాత్రమే ఉన్నారని, మిగితా పోస్టులన్ని ఖాళీగా ఉన్నాయని, రక్త నిల్వ సదుపాయం లేదు అని అన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ప్రసూతి తప్ప వేరే ఏ సేవలు లేవని ఎటువంటి శస్త్ర చికిత్సలు లేవని అన్నారు. ప్రసూతి సేవలకు కూడ స్కానింగ్ బయటే తీసుకోవాలని ఆపరేషన్ చేయాల్సి వస్తే మత్తు మందు వైద్యుడు అందుబాటులో ఉండడని తెలిపారు. నియోజకవర్గంతో కొత్తగా పీహెచ్‌లు , హెల్త్ సబ్ సెంటర్లు మంజూరు చేయించటంలో విఫలం అయ్యారని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి వారికి ఆ సదుపాయాలు ఉపయోగించుకునేల చూసే బాధ్యత ఎమ్మెల్యే పై ఉందని అన్నారు. సమావేశంలో నాయకులు మీర్ మాజీద్, అజ్జు, జిమ్మి రవి, మందుల పోశెట్టి, బాలకిషన్, హబీబ్, పెద్ద పోశెట్టి, శ్రీకాంత్, పాషా తదితరులు పాల్గొన్నారు